క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో అంబాభవానీ మాత



కుంకుమార్చన పూజలు చేస్తున్న మహిళలు

ఆదోని అర్బన్: పట్టణంలోని ఫారెస్ట్ లైన్ అంబా భవానీ ఆలయంలో మూడు రోజుల పూజా కార్యక్రమంలో భాగంగా మంగళవారం లక్ష గజవస్త్ర అలంకరణ చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ స్వకుళసాళి సమాజ మహిళా మండలి, ఆదోని స్వకుళసాళి సమాజ్ మహిళా మండలి తరఫున అమ్మవారికి మూడు రోజులుగా పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

ఆలయ భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

ఆదోని రూరల్: మండలంలోని పర్వతాపురం రెవెన్యూ గ్రామ పరిధిలో ఉన్న ఆలయ భూములను ఆన్‌లైన్ మీ భూమి పోర్టల్‌లో నమోదు చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి నాగరాజు గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆదోని డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఆదోని పట్టణంలోని శ్రీపేట బసవేశ్వర స్వామి పేరిట పర్వతాపురం గ్రామ పరిధిలో ఐదెకరాల భూమి ఉన్నట్లు, రెవెన్యూ మాన్యువల్ రికార్డులో ఉన్నప్పటికీ గత అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆన్‌లైన్ వెబ్‌ల్యాండ్ పోర్టల్‌లో నమోదు కాలేదన్నారు. ఆ భూమి నిషేధిత భూముల జాబితాలో ఉందని గుర్తు చేశారు. వెంటనే స్వామివారి పేరిట ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రామ పరిధిలోని దేవాలయ ఈనాం భూములను పరిరక్షించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. బీజేపీ నాయకులు మునిస్వామి, ఉరుకుందుగౌడ్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి విజ్ఞాన ప్రదర్శనకు ఎంపిక



విద్యార్థులను ప్రశంసా పత్రాలను అందిస్తున్న ఉపాధ్యాయులు

ఆదోని అర్బన్: కర్నూలులోని టౌన్ మోడల్ స్కూలులో ఈనెల 4వ తేదీన జరిగిన జిల్లా వైజ్ఞానిక సదస్సులో స్థానిక మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన నమూనా ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికైందని హెచ్‌ఎం, సైన్స్ ఉపాధ్యాయులు గిరిబాబు, నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు.. ప్రాజెక్టు రూపొందించి ప్రశంసా పత్రాలను అందుకున్న విద్యార్థులను మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు. వారు మాట్లాడుతూ.. జిల్లాస్థాయిలో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక సదస్సులో స్థానిక విద్యార్థులు ఉషా, హబీబా, నందిని 'పరిశుభ్రత – తాగునీటి శుద్ధి' అంశంపై నమూనా ప్రాజెక్టును ప్రదర్శించినట్లు తెలిపారు. సైన్స్ ఉపాధ్యాయులు దస్తగిరి, రామయ్య, సుశీలమ్మ, విజయభారతి, చంద్రావతి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మవ్వకు ప్రత్యేక పూజలు

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని రాఘవేంద్ర నగర్‌లో కొలువుదీరిన రేణుకా ఎల్లమ్మవ్వకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ఫల, పుష్ప క్షీరా, పంచామృతాభిషేకాలు నిర్వహించి అనంతరం ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. అమ్మవారిని భక్తులు, గ్రామస్తులు, కాలనీవాసులు దర్శించుకుని నారికేళాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అమ్మవారి ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

10 వాహనాలు సీజ్

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని మంత్రాలయం, మాధవరం పోలీస్‌స్టేషన్ల పరిధిలో రికార్డులు సక్రమంగా లేని 5 ఆటోలు, 5 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా రమబాయి జయంతి



రమబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కౌతాళం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సతీమణి రమబాయి 125వ జయంతి మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని మల్లనహట్టి గ్రామంలో వేడుకలను దళిత నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. రమబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్, రమబాయి పోరాట స్ఫూర్తి, దేశం కోసం వారు చేసిన సేవలను వివరించారు. కౌతాళం మాజీ సర్పంచ్ అవతారం, దళిత నాయకులు తిమోతి, వీరేష్, చిన్న, నర్సప్ప, రవి, బసవ, సురేష్, సిమోను, విద్యార్థులు గ్రామ యువకులు దళిత నాయకులు పాల్గొన్నారు.

జనరంజక పాలనకు నీరాజనం

- కపటిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం
- ఎమ్మెల్యేకు భారీ గజమాలతో స్వాగతం పలికిన వైఎస్సార్‌సీపీ నాయకులు
- 400కు పైగా గడపలను సందర్శించిన ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి



కపటి గ్రామంలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి



భారీ గజమాలతో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

ఆదోని రూరల్: ప్రభుత్వ జనరంజక పాలనపై ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఆదోని మండలం కపటి గ్రామంలో ఆయన పర్యటించారు. ముందుగా గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు క్రేన్ సాయంతో ఎమ్మెల్యేకు గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామంలో 400 గడపలను తిరిగి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరిస్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ పర్యటనకు ప్రజల నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే జనం గుండెల్లో జగనన్న ఏ స్థాయిలో స్థానం పొందారో అర్థమవుతోందన్నారు. మూడున్నరేళ్లలో మేనిఫెస్టోలోని 98 శాతం హామీలన్నీ అమలుచేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. స్థానికంగా ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించే దిశగా ప్రభుత్వం అడుగులేస్తుందని, మూడున్నరేళ్లలో ప్రజల వద్దకే పాలన అందించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలిచాడన్నారు. రానున్న ఎన్నికల్లో అఖండ మెజార్టీతో మరోసారి జగనన్నను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీఓ గీతావాణి, ఈఓపీఆర్‌డీ జనార్దన్, నాయకులు మధుసూదన్, పంపాపతి, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, దేవదాసు, రేణుక, మంజుల, శ్రీలక్ష్మి, కల్పవల్లి, రాజు, కడబూరయ్య, చంద్రశేఖర్, రాఘవేంద్ర, గోపాల్, నారాయణ, శంకరప్ప, రామిరెడ్డి, భాస్కర్, దేవదాసు, వీరేష్, వెంకటస్వామి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

'పాలపుంత' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న సాహితీవేత్తలు

పెద్దకడబూరు: మండల పరిధిలోని హెచ్.మురవణి ఉన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ప్రముఖ బాలసాహిత్య వేత్త గద్వాల సోమన్న రచించిన 30వ పుస్తకం 'పాలపుంత' బాలగేయాల సంకలనం కర్నూలులోని బిర్లా కాంపౌండ్‌లో డాక్టర్ బ్రహ్మారెడ్డి చేతుల మీదుగా మంగళవారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ.. అనతి కాలంలోనే 30పుస్తకాలను రచించి ప్రచురించడమే గాకుండా బాలసాహిత్యంలో గద్వాల సోమన్న అందించిన విశిష్ట సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నిఖిలేష్ ఎడ్యుకేషనల్ అకాడమీ అధ్యక్షుడు మద్దిలేటి, హెచ్‌ఈఈఓ నల్లమల ప్రకాష్‌రాజు, డాక్టర్ సౌదాకర్‌రాజు, కృపారాజు తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ఆర్డీటీ ధ్యేయం



ఆర్డీటీ ప్రతినిధులు యువ, మార్టిన్‌లకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

పెద్దకడబూరు: పేదరిక నిర్మూలనే ఆర్డీటీ ముఖ్య ఉద్దేశమని ఆ సంస్థ ప్రతినిధులు స్పెయిన్‌కు చెందిన యువ, మార్టిన్ పేర్కొన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆర్డీటీ సంస్థ సహకారంతో సర్పంచ్ రామాంజినేయులు ఆధ్వర్యంలో మంగళవారం 108 సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదరికంలో ఉన్న విద్యార్థులు చదువులను కొనసాగించేందుకు, సకాలంలో బడికి రావాలన్న ఉద్దేశంతో సైకిళ్లను పంపిణీ చేశామన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని పేదరికం నుంచి బయటపడాలని సూచించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ఆర్డీటీ సంస్థ పేదలకు ఎంతో తోడ్పాటునందిస్తుందన్నారు. విద్యార్థులు బాగా చదివి ఆర్డీటీ సంస్థ ఉద్దేశాన్ని పరిపూర్ణం చేయాలన్నారు. ఆర్డీటీ సంస్థ ఏరియా టీం లీడర్ సుబ్రమణ్యం, కోసిగి మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ ముక్కరన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి కూలి చెల్లించాలి



ఏపీఓ చక్రవర్తికి వినతి పత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఆదోని రూరల్: గత నవంబర్, డిసెంబర్, జనవరి నెలల్లో సుమారుగా 10–12 వారాల ఉపాధి హామీ వేతనాలను వెంటనే కూలీలకు చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.లింగన్న, మండల కార్యదర్శి డి.రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఏపీఓ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. అనంతరం ఏపీఓ చక్రవర్తికి వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ కష్టపడి పనిచేసిన కూలీలకు వేతనాలు అందించడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతోందని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రూపాయలు ధారాదత్తం చేస్తున్న మోదీ ప్రభుత్వం, చేతులకు బొబ్బలెక్కేలా పనులు చేసిన ఉపాధి కూలీలకు మాత్రం వేతనాలు అందించడం లేదని మండిపడ్డారు. ఉపాధి హామీ పని దినాలు 200 రోజులకు పెంచాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనం రోజుకు రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి ఉచ్చీరప్ప, వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సభ్యులు గోవిందు, అబ్దుల్‌రహీం, గోపాల్, శంకరప్ప, యు.తాయప్ప, రూబెన్ తదితరులు పాల్గొన్నారు.

సేవాభావంతో పనిచేయండి



సచివాలయాల కన్వీనర్లకు కిట్లు అందజేస్తున్న మురళీమోహన్ రెడ్డి



హాజరైన గృహసారథులు, కన్వీనర్లు

కోసిగి: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళదామని జగనన్న గృహ సారథుల మండల కన్వీనర్ పి.మురళీమోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు కోసిగిలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మండలస్థాయి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కోసిగి మండలంలోని 19 సచివాలయాల పరిధిలో 57 మంది కన్వీనర్లు, 512 మంది గృహసారథులను నియమించినట్లు తెలిపారు. వీరంతా వలంటీర్లతో కలిసి ప్రతి గడపకు వెళ్లి గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ సంక్షేమ పాలనలోని వ్యత్యాసాలను ప్రజలకు వివరించాలన్నారు. వలంటీర్ వ్యవస్థ తీసుకొచ్చి తలుపు కొట్టి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. గృహసారథులు, కన్వీనర్లు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేయాలని ప్రతి ఇంటికీ వెళ్లి పరిపాలన తీరును అడిగి తెలుసుకొని, వారి సమాధానాన్ని 82960 82960 ఫోన్ నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెట్టన గౌడ, ఎంపీపీ ఈరన్న, నాయకులు శ్రీనివాస రెడ్డి, మహంతేష్ స్వామి, నాడుగేని నాగరాజు, సర్పంచ్ అయ్యమ్మ, మంగమ్మ, హాజీ ఉస్మాన్, నూర్ అహ్మద్ పాల్గొన్నారు.

సమన్వయంతో శ్రమిద్దాం



మాట్లాడుతున్న మనోజ్‌కుమార్‌రెడ్డి

ఆదోని టౌన్: సమన్వయంతో పని చేస్తూ సీఎం జగనన్న ఆశయ సాధనకు కృషి చేద్దామని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు మనోజ్‌కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ద్వారకా ఫంక్షన్ హాలులో గృహసారథులు, కన్వీనర్లు, కౌన్సిలర్లకు 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. పట్టణంలోని 42 వార్డులకుగానూ 21 వార్డులకు సంబంధించిన గృహసారథులు 300 మంది, కన్వీనర్లు 33 మంది, కౌన్సిలర్లు 42 మంది, వలంటీర్లు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మనోజ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి మున్ముందు చేపట్టబోయే పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రస్తుత, గత ప్రభుత్వ పాలనలో తేడాలను ప్రజలకు వివరిస్తూ చైతన్యం తీసుకురావాలన్నారు. వార్డు సచివాలయాల ద్వారా 24 గంటల్లో ఏదేని సమస్య ఉన్నా పరిష్కారమవుతుందన్న భరోసా ప్రజల్లో కల్పించాలని సూచించారు. అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు ప్రభుత్వంపై కుట్రలు, కుతంత్రాలు, మోసపూరిత విమర్శలు చేస్తున్నాయన్నారు. కౌన్సిలర్లు రాజేశ్వర్‌రెడ్డి, ఎస్.పి.లక్ష్మిదేవి, ఉస్మాన్, బాలాజీ, రఘునాథ్‌రెడ్డి, తాయన్న, సిద్ధమల్లికార్జున, కె.మల్లికార్జున, సన్ని, వినోద్‌కుమార్‌రెడ్డి, మధుసూదన్‌శర్మ, మాజీ మున్సిపల్ చైర్మన్ దేవదాసు, కన్వీనర్లు పాల్గొన్నారు.

ఆశావర్కర్లకు కనీస వేతనం అమలుచేయాలి

కోసిగి: పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా ఆశావర్కర్లుకు నెలకు రూ.26 వేలు వేతనం అమలు చేయాలని ఆశావర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమీజాబీ కోరారు. మంగళవారం కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మండలంలోని ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశావర్కర్లను ప్రభుత్వ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలన్నారు. ఆశావర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 5వ తేదీన ఛలో ఢిల్లీ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. మండలంలోని ఆశావర్కర్లు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఏఎన్‌ఎం ఆశాలతపై చర్యలు తీసుకోవాలి

కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఏఎన్‌ఎం ఆశాలతపై చర్యలు తీసుకోవాలని ఆశావర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమీజాబీ డిమాండ్ చేశారు. ఆశావర్కర్లపై ఒత్తిడి చేస్తూ రూ.10 వేలు ఇవ్వాలని, గర్భవతుల నుంచి రూ.500 చొప్పున ఇప్పించాలని డిమాండ్ చేస్తోందని ఆరోపించారు. ఇటీవల చిర్తకల్లు ఆశావర్కర్‌ను వేధింపులకు గురిచేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేసి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆశావర్కర్ల మండల నాయకురాలు వెంకటమ్మ, సుజాత, పార్వతి, శ్రీదేవి, సంధ్య, అరుణ, లక్ష్మీ, మంజుల, సీఐటీయూ మండల ఉపాధ్యక్షుడు వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు రహిత సమాజ స్థాపనకు కృషి

కౌతాళం: కుష్టు రహిత సమాజ స్థాపనకు కృషి చేద్దామని డాక్టర్ పావని పిలుపునిచ్చారు. కుష్టు వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం స్థానిక కన్నడ ప్రాథమిక పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ వ్యాధి వస్తే స్పర్శ లేని మచ్చలు, ముఖము, చెవులు, వీపు మీద నొప్పిలేని బుడిపెలు, కనురెప్పలు, కనుబొమ్మలు రాలిపోవుట, కాళ్లు చేతులు తిమ్మిర్లు, వాపులు బొటన వేలు, చిటికెన వేలు, మటికట్టు పనిచేయకపోవడం, కాలి వేళ్లు నేలకు రాసుకోవడం, పాదాలు చేతులపై బొబ్బలు రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ లక్షణాలను గుర్తిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ వ్యాధి బారిన పడకుండా అందరికీ అవగాహన కల్పిస్తామని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఏఎన్‌ఎంలు దినకుమారి, హనుమంతమ్మ, ప్రధానోపాధ్యాయురాలు త్రివేణి, ఉపాధ్యాయులు విశాలక్షి, శాంతమూర్తి, వీరాకుమార్, విద్యావతి పాల్గొన్నారు.

మున్సిపల్ పార్కుల అభివృద్ధికి చర్యలు



ఇందిరానగర్‌లో పార్కును పరిశీలిస్తున్న కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

ఆదోని టౌన్: పట్టణ ప్రజలు, విశ్రాంత ఉద్యోగులు, సీనియర్ సిటిజన్లకు ఆహ్లాదకరంగా ఉండేలా పార్కులను అభివృద్ధి చేస్తామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఇందిరానగర్, టీజీఎల్ కాలనీలో ఏర్పాటు చేసిన పార్కులను ఆయన పరిశీలించారు. వృద్ధులు, సీనియర్ సిటిజన్లకు కాలక్షేపం, విద్యార్థులు, చిన్నారుల కోసం ఆట వస్తువులు, వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఆంధ్రా ముంబాయిగా పేరుగాంచిన ఆదోనిలో పార్కులు అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం పీస్ పార్కులోని పంప్‌హౌస్ వద్ద తాగునీటి లైన్‌మెన్‌లతో సమావేశమయ్యారు. నీటి సరఫరాలో అవాంతరాలు లేకుండా చూడాలన్నారు. ట్యాంకర్ల ద్వారా మున్సిపల్ వాటర్‌ను ఎవరికి పడితే వారికి సరఫరా చేయవద్దని ఆదేశించారు. 6వ వార్డు సచివాలయాన్ని తనిఖీ చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. కొన్ని సచివాలయాల్లో ఉద్యోగుల పనితీరు బాగాలేదని ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిని సరిదిద్దుకోవాలన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాల్సి ఉందన్నారు. ఈయన వెంట ఎంఈ నాగభూషణ్‌రెడ్డి, వాటర్ వర్క్స్, శానిటేషన్, ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఉన్నారు.

పథకాల అమలు భేష్



ముగతిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం అధికారులు

నందవరం: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు రాష్ట్రంలో బాగా అమలవుతున్నాయని నేషనల్ లెవల్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పి. ప్రదీప్‌కుమార్, పి.సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మిట్టసోమపురం, ముగతి గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు, వేతనాలు, పని దినాలు, వైకేపీ ద్వారా అమలు చేస్తున్న పథకాలు, పింఛన్ల పంపిణీపై ఆరా తీశారు. ఆయా గ్రామాల్లో ఉపాధి పనుల్లో భాగంగా చెక్‌డ్యాం, ఫారంపాండ్ పనులు, పీఎంఏజే పథకం కింద మంజూరైన గృహాలను పరిశీలించారు. సీసీ రోడ్లు, డ్రైయినేజీల నిర్మాణాలకు నిధులు కేటాయించాలని సర్పంచ్‌లు లక్ష్మిదేవి, విరుపాక్షిరెడ్డి, ఎంపీటీసీ వెంకటేశ్వరమ్మ తదితరులు కోరగా నివేదికను కేంద్రానికి పంపుతామన్నారు. వాటర్‌షెడ్ ఏపీడీ సలీంబాషా, ఏపీడీ అలీపీర, ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, పీఆర్ ఏఈ జయన్న, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

నందవరం: పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని జిల్లా సమగ్రశిక్ష బాలికల శిశు అభివృద్ధి అధికారిణి (జీసీడీఓ) సునీత ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం స్థానిక కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. డైనింగ్ హాలు, స్టోర్ రూములు, భోజనం, టీచర్స్ డైరీ, పాఠ్య ప్రణాళికలు పరిశీలించారు. విద్యార్థినుల సామర్థ్యాలను పరిక్షించారు. ఏఎల్‌సీఓ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ శైలజ, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

ఈరన్న స్వామికి 5 సెంట్ల స్థలం విరాళం



అధికారులకు దస్తావేజులను ఇస్తున్న దాతలు

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయానికి మంగళవారం భక్తులు స్థలాన్ని విరాళంగా సినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి తెలిపారు. బెంగళూరు వాస్తవ్యులు ఎం.బి. వేణుగోపాల్ వారి కుమారులు చంద్రకాంత్, దేవానంద్ కుటుంబ సభ్యులు 5 సెంట్ల స్థలాన్ని దేవస్థానానికి విరాళంగా అందజేసినట్లు తెలిపారు. దేవస్థానానికి దగ్గరలో తిమ్మాపురం రోడ్డులోని గుడారం తాత గుడి వద్ద ఉన్న స్థలాన్ని ఈరన్న స్వామి పేరిట రిజిస్టర్ చేసి దస్తావేజుల్ని ఆలయ కార్యాలయంలో అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలు, పూలమాల, స్వామి వారి శేషవస్త్రాలు, లడ్డూ ప్రసాదం, బాండును అందజేశారు. ఆలయ సిబ్బంది సీనియర్ అసిస్టెంట్ కిరణ్ కుమార్, ఆలయ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, కుమారన్న, రాజు పాల్గొన్నారు.

పంట దిగుబడులకు మద్దతు ధర

ఎమ్మిగనూరు: రైతులు పండించిన దిగుబడులకు ఈయేడు మంచి ధరలు లభిస్తున్నాయి. పత్తి ధరలు మినహాయించి మిగతా పంటలకు మద్దతుకు మించిన ధరలే లభిస్తున్నాయి. మంగళవారం ఎమ్మిగనూరు మార్కెట్ యార్డులో 188 మంది రైతులు 1,319 క్వింటాళ్ల వేరుశనగను విక్రయానికి తెచ్చారు. మద్దతు ధర క్వింటాలుకు రూ.5,550 కాగా అత్యధికంగా రూ.8,350 పలికింది. ఆముదాలు రూ. 6,450, కందులు రూ.6,730, శనగలు రూ.4,430, పూల విత్తనాలు రూ.4,090లకు అమ్ముడుపోయాయి. జిన్నింగ్ మిల్లుల్లో పత్తిని రూ.7,500లకు కొనుగోలు చేశారు.

అడిగిన వారందరికీ 'ఉపాధి'



పి.కోటకొండలో ఉపాధి పనులను తనిఖీ చేస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి

ఆలూరు: జాబ్ కార్డు కలిగిన ప్రతిఒక్కరికీ ఉపాధి పనులు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి అన్నారు. దేవనకొండ మండలం పి.కోటకొండ గ్రామంలో ఉపాధి పనులను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం స్థానిక సీఎల్‌ఆర్‌సీ కార్యాలయంలో మండలంలోని టీసీ, ఈసీ, ఎఫ్‌ఏలు, సీనియర్ మేట్లతో సమావేశమయ్యారు. పీడీ మాట్లాడుతూ.. గ్రామాల్లో అందరికీ పనులు కల్పించి వలసల నివారణకు కృషి చేయాలని సూచించారు. అలాగే వంద రోజులు పని, కూలీల సంఖ్య 500 మందికి తగ్గకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో 20 ఎకరాలకు తగ్గకుండా ఉద్యాన పంటలు సాగు చేయించే బాధ్యతను తీసుకోవాలన్నారు. ఏపీఓ కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆశయ సాధనకు కృషి చేద్దాం



ఆలూరులో మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: అవకాశాన్ని అందిపుచ్చుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పిలుపునిచ్చారు. స్థానిక ఎల్లార్తి రోడ్డు సమీపంలోని ఇబ్రహీం ఫంక్షన్ హాల్లో ఆస్పరి, దేవనకొండ మండలాలకు చెందిన గృహసారథులు, ప్రజా ప్రతినిధులు, మండల కన్వీనర్లు, గ్రామ వలంటీర్లతో మంగళవారం ఆలూరు మండల కన్వీనర్ వీరేష్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మంత్రితో పాటు నారాయణస్వామి, శ్రీనివాసులు, ఎంపీపీలు లక్ష్మిదేవి, ఉమాదేవి, జెడ్పీటీసీలు దొరబాబు, రామకృష్ణ, మల్లికార్జున, పెద్దయ్య, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ.. గృహసారథులు, మండల కన్వీనర్లు, ప్రజాప్రతినిధులతో కలసి ప్రభుత్వ విధి, విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రజా సేవ కోసం పాటు పడుతున్న సీఎం జగనన్న ఆశయ సాధనకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు.

టీడీపీ నేతలకు మాటల్లేవ్?

సీఎం వైఎస్ జగన్ సారథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి టీడీపీ నాయకులు దిగజారుడు రాజకీయాలు చేస్తూ తప్పుడు విమర్శలకు దిగుతున్నారని మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే వైఎస్సార్‌సీపీ నేతల అంతు చూస్తామని మాట్లాడడం నోటి దురుసుతనం కాదా అని ప్రశ్నించారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కోట్ల సుజాతమ్మ ఎమ్మెల్యే కావాలని పగటి కలలు కంటున్నారని అది నెరవేరదన్నారు. రానున్న ఎన్నికల అనంతరం టీడీపీ కార్యాలయాలకు తాళం వేడం ఖాయమని జోష్యం చెప్పారు.

ఇష్టపడి చదివితేనే మంచి ఫలితాలు

గోనెగండ్ల: పదో తరగతి విద్యార్థులు ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ వేణుగోపాల్ సూచించారు. మంగళవారం సాయంత్రం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలకు సన్నద్ధం కావడంపై పలు సూచనలు చేశారు. విద్యార్థులు భయం, ఆందోళన వీడి ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. ప్రణాళికను తయారు చేసుకొని చదువుకోవాలని, సందేహాలుంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. వంద శాతం ఉత్తమ ఫలితాల కోసం పట్టుదలతో పని చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్లానింగ్ కో–ఆర్డినేటర్ మారుతి, ఎంఈఓ వినోద్ కుమార్, హెచ్‌ఎం నాగభూషణం పాల్గొన్నారు.